

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**

సంపుటి : 11 | సంచిక : 2 | అక్టోబరు 2005



**రమణ భాస్కర**
ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 36**

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 8/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

**ఈ సంచికలో....**

భీమవరం .................... 26-08-05
అరుణాచలం ................ 11-09-05
యానాం ...................... 04-09-05

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-08-05, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు జన్మాష్టమి, శ్రీకృష్ణుడి జన్మదినము, ఆయన పూర్ణ పురుషుడు. ఆయన సాధన చేసి దేవుడు అవ్వలేదు, ఆయన సహజంగా దేవుడు. శ్రావణ బహుళ అష్టమిరోజున భగవంతుడు అన్ని కళలతోటి, అన్ని శక్తులతోటి మధురపట్టణంలో ఒక కారాగారంలో జన్మించిన వాడివలె కనిపించాడు. భగవంతుడు జన్మరహితుడు, మరణరహితుడు, ఆకారరహితుడు, గుణరహితుడు, వికారరహితుడు. అన్ని వికారములు ఉన్నవాడు జీవుడు, ఏ వికారము లేనివాడు దేవుడు. సాధారణంగా పిల్లలు పుట్టిన తరువాత పెద్దవారు వారికి మాటలు నేర్పుతారు. పుట్టగానే మాట్లాడిన దేవుడు ఎవరైనా ఉన్నారా అంటే వాడు కృష్ణుడు. నేను ఇక్కడ ఉన్నాను, ఈ శరీరాన్ని తీసుకొని వెళ్ళి రేపల్లెలో యశోద ఇంటిలో పెట్టండి అని వసుదేవుడితో చెపుతాడు. మరి యమునా నది వరదలో ఉంది అక్కడకు నిన్ను తీసుకొని వెళ్ళటం ఎలాగ? అని వసుదేవుడు అడిగితే నది దారి ఇస్తుంది అని చెప్పాడు. పుట్టగానే ఈ మాటలు అన్నీ చెప్పాడు, వాడు దేవుడు. రాముడి అవతారంలో మనం ఎలా జీవించాలో ఆయన ఆచరించి మనకు చూపించాడు. రాముడు మహావిష్ణువే, కృష్ణుడు మహావిష్ణువే. కాని ఆయన శరీరపాత్ర వేరు, ఈయన శరీరపాత్ర వేరు. ఒకో ఉపాధి ద్వారా ఒకో పని జరుగుతుంది. జ్ఞానికి, అజ్ఞానికి పెద్ద తేడా ఏమీ లేదు. అన్నింటికీ తానే కర్తను అని అజ్ఞాని అనుకొంటాడు, దేనికీ నేను కర్తను కాదు అని జ్ఞాని అనుకొంటాడు. అందుచేత జ్ఞాని సుఖంలో ఉంటాడు. అన్నింటికి తానే కర్తను అనుకోవటం వలన అజ్ఞాని వేదనలో, దుఃఖ సముద్రములో ఈదులాడుతూ ఉంటాడు. కృష్ణుడు అంటే ఒక ప్రేమ ప్రవాహం, భక్తి ప్రవాహం, జ్ఞాన ప్రవాహం. ఆయన అందరిలోను

అంతర్యామిగా ఉన్నాడు, అందరికి అతీతంగా ఉన్నాడు. యుద్ధానికి రమ్మని అర్జునుడిని కృష్ణుడు పిలువలేదు, యుద్ధానికి రమ్మని అర్జునుడే కృష్ణుడిని పిలిచాడు. అర్జునుడు యుద్ధం చేయటానికి వచ్చి శంఖం ఊదాడు, ఎదురుగా ఉన్న వారిని చూసి సడన్‌గా ఆయనకు మమకారం వచ్చింది, మోహం వచ్చింది. మనలో మమకారం ఉన్నంతకాలం కోటి జన్మలు ఎత్తినా కర్మ మనలను విడిచిపెట్టదు. మమకారరహితుడిని, అహంకారరహితుడిని కర్మ వాసనలు విడిచిపెడతాయి కాని అహంకారంతో కూడిన వాడిని, మమకారంతో కూడిన వాడిని కర్మ వాసనలు విడిచిపెట్టవు. మమకారం వలన వీడు యుద్ధం చేయనంటున్నాడు అని కృష్ణుడు గ్రహించాడు. అర్జునుడిలో ఉన్న మమకారం పోగొట్టటానికి, మోహం పోగొట్టటానికి భగవంతుడు భగవద్గీత బోధించాడు.

కృష్ణుడికి పార్థసారథి అని పేరు అంటే అర్జునుడికి రథసారథి. మనకు నిజమైన భక్తి కనుక ఉంటే మన జీవితరథాన్ని కూడా ఆయన తోలతాడు. ఆయన అర్జునుడికి దగ్గరవాడు, మనకు దూరంవాడు కాదు, ఏ పక్షపాతం లేనివాడు పరమాత్మ. పక్షపాతం ఉన్నవాడు జీవుడు. ఆయన మన బండిని తోలడేమో అని మన అజ్ఞానం వలన అలా అనుకొంటున్నాము, మనకు ఆయన పట్ల పరిపూర్ణమైన విశ్వాసం కనుక ఉంటే మన బండిని కూడా ఆయన తోలతాడు, వాడే సర్వేశ్వరుడు, వాడే సర్వజ్ఞుడు, జగత్తును నియమించేవాడు, జీవకోటికి కర్మఫలాన్ని కేటాయించేవాడు ఆయనే. భక్తతుకారాం పాండురంగ భక్తుడు. రంగడు అన్నా, కృష్ణుడు అన్నా ఒక్కటే. ఓ పాండురంగ విఠలా, ఓ కృష్ణా, ఓ అచ్యుతా, ఓ గోవిందా ఈ లోకంలో ఎంతో ఐశ్వర్యాన్ని చూసాను, అధికారం చూసాను, సంపదలు చూసాను, ఆయా రంగాలలో పెద్దవారయిన వారిని చూసాను, ఈ లోకంలో ఉన్న రకరకాల మనుషులను చూసాను. ఈ లోకంలో నీ పేరులో తప్పించి ఎక్కడా నాకు రుచి కనిపించలేదు అన్నాడు తుకారామ్. ఏసుక్రీస్తు శరీరం, బుద్ధుడి శరీరం, రామకృష్ణ పరమహంస శరీరం వీరందరి శరీరాలు శవాలు అయినవి కాని, శరీరంతోటి వైకుంఠానికి వెళ్లినవాడు తుకారామ్, ఆయన శరీరం శవం అవ్వలేదు. మన రీజన్‌కు అందటం లేదు ఏమిటి అని హేతువాదులందరు కొట్టుకొని చచ్చారు. శరీరంతో సహా భగవంతుడిలో ఐక్యమయినవాడు తుకారామ్. మీరు పురాణాలు కాదనవచ్చు కాని ఇది 400 సం॥లకు క్రితం జరిగింది.

భీష్ముడు మహాభక్తుడు, ఆయనకు స్వచ్ఛంద మరణం ఉంది, ఆయనను ఎవరూ చంపలేరు. భారతయుద్ధంలో ఆయన పదిరోజులు యుద్ధం చేసిన తరువాత యుద్ధం ఆపు చేసేసాడు, ఉత్తరాయణం వచ్చేదాక అంపశయ్యమీద ప్రాణం కాపాడుకొన్నాడు, ఉత్తరాయణం వచ్చాక ప్రాణం విడిచిపెట్టాడు. భీష్ముడు యుద్ధం మానివేసిన రోజున రాత్రి దుర్యోధనుడు కర్ణుడి దగ్గరకు వెళ్లి తాతగారు వెళ్లిపోయారు, ఆయన ఏ సుఖం అనుభవించలేదు, మన కోసం త్యాగాలు చేసాడు అని బాధపడతాడు. ఆయన పెద్దవాడు, మహాభక్తుడు. ఆయనను

చూసి వద్దామని అప్పుడు కర్ణుడికి అనిపించింది. భీష్ముడు అంపశయ్యమీద పడుకొన్నాడు, కర్ణుడు అక్కడకు వెళ్ళాడు. అప్పుడు కర్ణుడు భీష్ముడితో "ఓ పితామహా! నీకు నేను అంటే ఇష్టం ఉండదు, నన్ను చూడటం కూడా నీకు ఇష్టం ఉండదు. అందుచేతనే నువ్వు యుద్ధం చేస్తున్నంతకాలం నేను యుద్ధం చేయను అని చెప్పాను. నేను అంటే నీకు ఇష్టంలేకపోయినా మరల కనిపించవని చూడటానికి వచ్చాను" అని చెపుతాడు. "కర్ణా! నీవు పొరపాటుగా అర్థం చేసుకొంటున్నావు, నువ్వు అంటే నాకు ఇష్టం లేకపోవటం ఏమిటి? అర్జునుడి కంటే నీవు గొప్ప వీరుడివి కాని నీకు గర్వం ఎక్కువ, ఇతరులను అవమానపరిచే గుణం నీలో ఉంది, పాండవులను అనేకసార్లు అవమానించావు. నీ గర్వం అణచటానికి, నీవు బాగుపడటానికి సభలలో అలా మాట్లాడాను గాని, నీమీద ఇష్టం లేకకాదు కర్ణా!" అన్నాడు భీష్ముడు. "సరే! నాపని అయిపోయింది, రేపటి నుండి నీవు యుద్ధం చెయ్యి, పాండవులను జయించి ఈ మూటనంతా దుర్యోధనుడికి ఇస్తేవాడు మింగుదామని చూస్తున్నాడు, నువ్వు యుద్ధం చేసి నీ పని ఏదో నీవు పూర్తి చెయ్యి" అని చెపుతాడు. అప్పుడు కర్ణుడు తన హృదయాన్ని ఓపెన్ చేస్తాడు, "భీష్మా! నన్ను ఎందుకు మాయలో పెడతావు? ఆ నల్లటివాడు, అర్జునుడి రథంతోలేవాడు ఎవడో తెలియనంత అమాయకుడినా? అన్నాడు కర్ణుడు. రేపటి నుండి యుద్ధం చెయ్యి, పాండవులను జయించి రాజ్యాన్ని అప్పగించు అంటున్నావు - మన తలరాతలు వ్రాసేవాడు, ఆ ప్రకారం నడిపించేవాడు, ఆ నల్లటివాడిని ఎవరు జయిస్తారు? ఎందుకు ఈ మాయమాటలు చెపుతున్నావు? అంటాడు కర్ణుడు. కౌరవసైన్యంలో పెద్దపెద్ద వీరులు, మహావీరులు ఎంతోమంది ఉన్నా కృష్ణుడు రథసారధ్యం చేస్తూ వారినందరిని తప్పించుకొని, ఆ సుడిగుండాలలో పడకుండా పాండవులను రక్షించి, యుద్ధంలో నెగ్గించగల శక్తి ఆ నల్లటివాడికి ఉందని నాకు తెలియదా? నీకు తెలియదా? ఈ మాయమాటలు ఎందుకు భీష్మా?" అంటున్నాడు. పాండవులను ఎలా ఒడ్డుకు తీసుకొని వచ్చాడో అలాగ మనం సాధన చేసేటప్పుడు ఎన్ని అవరోధాలు వచ్చినా వాటి నుండి మనలను తప్పించి, మనలను ఒడ్డుకు తీసుకొని వచ్చే వాడే మన గురువు, వాడే పరమాత్మ.

భక్తుల జీవితాలలో మీకు ఎన్నో కష్టాలు కనబడతాయి. మీరాభాయి ఎన్నో కష్టాలు పడింది, కబీరుకూడా ఎన్నో కష్టాలు పడ్డాడు. ఆ కష్టాలన్నింటిని ప్రక్కకు పెట్టి, అటు చూడకుండా, లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా, మోక్షాన్నే గమ్యంగా పెట్టుకొని తదనుగుణంగా భక్తుడు మాట్లాడుతూ ఉంటాడు కాని దానికి భిన్నంగా అసలు ఏమీ మాట్లాడడు. మనం గమ్యాన్ని మర్చిపోతే మన జీవితానికి అర్థంలేదు. భక్తుడు ఎప్పుడూ అర్థంపర్థంలేని మాటలు మాట్లాడకూడదు, తను ఏదైతే గమ్యంగా పెట్టుకున్నాడో దాని గురించే మాట్లాడాలి. ఇది కబీరు, మీరాభాయి జీవితాలలో కన్పిస్తుంది. కృష్ణుడు అవతరించి యుద్ధాలు చేయటమే కాదు, యుగాలు మారినా కలకాలం మనకు ఉపయోగపడేలా, ఈ ప్రకృతి మధ్యలో ఉండి ప్రకృతి గుణాల నుండి విడుదల పొంది

శాశ్వత పదవిని, మోక్షాన్ని ఎలాపొందాలి అనేది, ఒక మెట్టు తరువాత ఒక మెట్టు ఎక్కి మేడపైకి ఎలా వెళతామో అలాగ అనేకమెట్లు చూపించి, అనేక కోణాలు చూపించి, మనం తరించటానికి ఎన్నో ఉపాయాలు భగవంతుడు చెప్పాడు, అదే భగవద్గీత, అదే గోవిందుడు చెప్పిన ఉవాచ. ఈమధ్య హైవేలో 4 లైన్స్ రోడ్డు వేసారు, మనం బ్రేకు మీద కాలు వేయకుండా చాలా స్పీడుగా వెళ్లిపోవచ్చును. భగవద్గీత మనకు ప్రోపర్‌గా అర్థమయితే అలా చాలా స్పీడుగా వెళ్లి ధర్మాన్ని ఆచరించి, మోక్షాన్ని పొందవచ్చును. అటువంటి మార్గాలు గీతలో భగవంతుడు చూపించాడు. మనకు ధర్మం మీద గౌరవంలేదు, తోటి మానవుడి మీద గౌరవం లేదు, సామాజిక స్పృహ లేదు. గుడికి వెళితే మనం బాగు పడాలని, పైకి వెళ్లిపోవాలని ప్రార్థించటమేగాని మీరు ఎప్పుడైనా మీ జీవితంలో ఇతరులకోసం దేవుడిని ప్రార్థించారా? ఇంటి దగ్గర కూర్చొని ఏదో అరగంట ప్రాణాయామం చేసి, అరగంట ధ్యానం చేసి సందుల ద్వారా మోక్షానికి వెళ్లిపోతావా? మీలో మీరు పరిశోధన చేసుకోండి. మీరు పూజ చేసినా, వ్రతం చేసినా మీ గురించి మీరు చేసుకొంటున్నారు కాని ఇతరుల కోసం ఎప్పుడైనా మీరు చేసారా? నువ్వు గొప్పస్థితికి వెళ్లిపోవాలనుకొంటున్నావు లేకపోతే రాబోయే జన్మ గొప్పజన్మ రావాలనుకొంటున్నావు లేకపోతే చనిపోయిన తరువాత గొప్ప గొప్ప లోకాలకు వెళ్లిపోవాలనుకొంటున్నావు. ఈ పూజచేస్తే ఇది వస్తుంది, ఆ పూజచేస్తే అది వస్తుంది ఇలా వెళ్లిపోవాలనుకొంటున్నారు కదా. ఇలా గొప్ప జన్మ రావాలని, వైకుంఠానికి వెళ్లిపోవాలని, అందరూ నా వంక చూడాలని నీలో ఎవడైతే విర్రవీగుతున్నాడో వాడిని వదిలించుకోకపోతే నీకు గతిలేదు అంటున్నారు భగవాన్. ఇలా అనుకునేవాడు ఎవడు? వాడిని అర్థంచేసుకొని, వాడిలోనుండి విడుదల పొందకపోతే నువ్వు కోటి జన్మలు ఎత్తినా నీకు ముక్తిలేదు, నీకు సహజస్థితి రాదు.

జ్ఞానం మనిషిని పరమపవిత్రుడిని చేస్తుంది. జ్ఞానంతో సమానమైనది ఈ ప్రపంచంలో ఏదీ లేదు. మన అవసరాలకోసం దేవుడిని ప్రార్థిస్తున్నాము కాని ఓ కృష్ణా! నారాయణా! నాకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించు, నా గమ్యం అదే అని ప్రార్థించేవారు మనలో ఎంతమంది ఉన్నారు. ఈ సృష్టిలో ఆత్మజ్ఞానం లేనివారికి ఇంతవరకు మోక్షం రాలేదు, నిర్వాణసుఖం అందలేదు. నీకు కోరిక, ద్వేషం లేకపోతే ఈ బంధంలో నుండి ఏమీ నొప్పి లేకుండానే విడుదల పొందుతావు అర్జునా! అంటే బాధపడి గమ్యాన్ని చేరటం కాదు. మనం భీమవరంలో ట్రైనులో జాయిన్ అయ్యాము అనుకోండి, మనకు గాఢనిద్ర వచ్చేసింది అనుకోండి, మనం నిద్రలో ఉంటాము. ఈలోపుగా సికింద్రాబాద్ వచ్చేస్తుంది. అప్పుడే సికింద్రాబాద్ స్టేషన్ వచ్చేసిందా అనుకొంటాము. నీకు కోరిక, ద్వేషం, ఫలకాంక్ష లేకపోతే అంత సుఖంగా, అంత తేలికగా, సేఫ్‌గా మోక్షాన్ని పొందుతావు.

మనకు కర్మవాసనలు ఎలా వస్తాయి అంటే ఎక్కడో ఇష్టం పెట్టుకొంటాము, ఎక్కడో

అయిష్టం పెట్టుకొంటాము. అయిష్టం పెట్టుకొన్న చోట ఎలా బయట పడాలో చూస్తాము, ఇష్టం పెట్టుకొన్నచోట ఆ కోరిక ఎలా నెరవేర్చుకోవాలి అని చూస్తాము. వీటి వలన కర్మవాసనలు పెరుగుతాయి, ఆ వాసనలే నిన్ను బంధిస్తాయి. "24 గంటలు కష్టపడి ధ్యానం చేసి ఏదైతే పొందుదామనుకొంటున్నారో, కర్మఫలకాంక్ష లేకుండా పనిచేసేవాడు కూడా అదే పొందుతాడు" అని గీతలో పరమాత్మ చెప్పాడు. "వాడు పొందేది వేరు, వీడు పొందేది వేరు అని ఎవరైనా చెపితే పిల్లకాయల మాటల కింద వదిలెయ్యి" అని చెప్పాడు. మీరు ఒకటి మర్చిపోకూడదు. మీరు జపం చేసినా, ధ్యానం చేసినా, పూజ చేసినా, యాత్రలు చేసినా, ఇంటి దగ్గర వ్రతాలు చేసినా ఎన్ని చేసినా ఇవి అన్నీ కూడా మన మనస్సును పవిత్రం చేయటానికి, మన బుద్ధిని శుద్ధి చేసుకోవటానికి చేస్తున్నాము అని మర్చిపోవద్దు. మన బుద్ధి శుద్ధి అయితే అప్పుడు అది గమ్యం మీద నిలబడుతుంది. మన బుద్ధి శుద్ధి అవ్వకపోతే గంటకు ఒక రకంగా ఉంటాము. బుద్ధికి స్థిరత్వం లేదు, మనస్సు నిండా కోరికలు వీరికా మోక్షం అంటున్నాడు పరమాత్మ. ఎవరైనా ఏదైనా ఇస్తే నేను తీసుకొంటానయ్యా, ఆకు ఇస్తే ఆకు తీసుకొంటాను, నీళ్ళు ఇస్తే నీళ్ళు తాగుతాను, పండు ఇస్తే పండు పుచ్చుకొంటాను, ఎప్పుడు? నువ్వు ప్రేమతో, భక్తితో ఇస్తే తీసుకొంటాను అంటున్నాడు. దేవుడు అంటే ప్రేమ, దేవుడు అంటే శాంతి, దేవుడు అంటే ఉండటం. దేవుడు అంతటా ఉన్నాడు, ఆయన నీ హృదయంలో ఉన్నాడు. నీకు దేహమే నేను అనే తలంపు ఉంది కాబట్టి ఈ దేహం నిజం, ఈ లోకం నిజం, దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావు. అంతర్యామిగా ఉన్న దేవుడిని తెలుసుకోలేక పోతున్నావు. ఈ దేహాత్మబుద్ధిలో నుండి విడుదల పొందితేగాని నిర్వాణసుఖం పొందలేవు.

ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటి అంటే ఒక్కటే. నువ్వు భగవంతుడిని ప్రార్థించగా ప్రార్థించగా, జపించగా జపించగా, ధ్యానించగా ధ్యానించగా, నీ మనస్సుతోటి, ఇంద్రియాలతోటి నీ బుద్ధితోటి భగవంతుడు సంతోషించే పనులు చేస్తూ ఉంటే, భగవంతుడి అనుగ్రహం కోసమే నీవు పనిచేస్తూ ఉంటే ఆయనే నీకు గురువుగా వచ్చి నిన్ను తరింపచేస్తాడు, ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. భగవంతుడు నీకు ఎన్ని అవకాశములు ఇచ్చాడో అన్ని అవకాశములతోటి ఆయనను ప్రార్థిస్తూ ఉంటే, నీకు చెవులు ఉన్నాయి భగవంతుడిని పొందటంకోసం వినండి, కళ్ళు ఉన్నాయి భగవంతుడి రూపాన్ని చూడండి, నోరు ఉంది భగవంతుడి గురించి మాట్లాడండి, కాళ్ళు ఉన్నాయి గుడి చుట్టూ తిరగండి, చేతులతోటి ఆయనను పూజించండి, ఇలా మీ అవయవాలు అన్నీ ఉపయోగించుకొని భగవదనుగ్రహం పొందటానికి ప్రయత్నం చేయండి. అప్పుడు అంతటా ఉన్న ఆ నల్లటివాడు పరమాత్మ మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మధురాధిపతి వదనం మధురం, గమనం మధురం, మధురాధిపతికి అంతా మధురమే, యుద్ధం కూడా ఆయనకు మధురమే. అనంత తత్త్వానికి

ఆకాశం కూడా గుర్తే, సముద్రం కూడా గుర్తే అన్నారు రాజగోపాలాచారి. లోతుకు సముద్రంలాంటి వాడు, విశాలానికి ఆకాశంలాంటివాడు, వాడే నల్లనయ్య అంటాడు రాజాజీ. ఇప్పుడు మీకు సాధన బాగా జరగటం లేదు అంటే మీరు పూర్వజన్మలో సాధన ఏమీ చెయ్యలేదని అర్థం. మీరు పూర్వజన్మలో బాగా సాధన చేస్తే, పూర్వజన్మ పుణ్యబలం మీకు ఉంటే ఆ వాసనే, ఆ సంస్కారమే, ఆ పుణ్యబలమే నీచేత ఇప్పుడు సాధన చేయిస్తుంది. కొంతమంది ఎలా ఉంటారు అంటే మేము వండుకొన్నది అంతా మేమే తినేస్తాము, మేము సంపాదించుకొన్నది అంతా మేమే తినేస్తాము, మేము ఎవరికి ఒక్క మెతుకు కూడా పెట్టము అంటారు, అటువంటివారు ఎవరైనా ఉంటే వారు తినేది అన్నముకాదు, పాపము తింటున్నారు అంటున్నాడు పరమాత్మ. వారు బతికి ఉండగా పాపం పోగేసుకొంటారు, మరణానంతరము వారికి చీకటిలోకాలు మిగులుతాయి. మీ జీవితంలో గౌరవాలు ఆశించకుండా, గొప్పలు ఆశించకుండా కనీసం ఒక్క మనిషినైనా ప్రేమించావా? చాలామంది మంచిపనిచేసేవారు కూడా గౌరవాలు ఆశించి ఆ పనులు చేస్తారు. దాని వలన ప్రపంచంలో గొప్ప రావచ్చు కాని ఈశ్వరుని దయ నీకురాదు.

మనకు దేహాభిమానంలో నుండే ద్వైతబుద్ధి వస్తుంది. అబేధంగా ఉన్న పరమాత్మలో కూడా మనం భేదం చూస్తాము. జ్ఞాని ఈ భేదాల మధ్యన అభేదాన్ని చూస్తాడు, ఈ భేదాలకు అతీతంగా ఏ వస్తువు అయితే అభేదంగా ఉందో దానిని దర్శిస్తాడు, వాడే నిజమైన జ్ఞాని, వాడే సత్పురుషుడు. బాలకృష్ణుని చంపమని కంసుడు పూతనని పంపుతాడు. పూతన తన స్థనంలో విషం పెట్టుకొని కృష్ణుడికి పాలు ఇస్తుంది. కృష్ణుడు దగ్గరకు వస్తుంది, లాలిస్తుంది, నెమ్మదిగా ఎత్తుకొంటుంది. ఈ భూమి భారాన్ని మోసే వాడిని ఎవరు ఎత్తుకోగలరు? వాడు ఇష్టపడితే మనం ఎత్తుకోగలము కాని వాడి ఇష్టం లేకపోతే మనం ఎలా ఎత్తుకొంటాము. పూతన కృష్ణుడిని ఎత్తుకొని విషం పాలు ఇస్తుంది. కృష్ణుడు ఏమి చేసాడు అంటే ఆవిడ పవిత్రురాలు కాకపోయినా ఆవిడ స్థనంలో ఉన్న విషంపాలు తాగి, ఆవిడకు పవిత్రత చేకూర్చి, పాడుబుద్ధిని తొలగించి సద్బుద్ధిని కలుగజేసి పూతనకి మోక్షం ఇచ్చాడు, వాడు కృష్ణుడు. ఎప్పుడూ కూడా దేవుడికి మొదలు, చివర చూడటానికి ప్రయత్నం చేయకూడదు, అది పొరపాటు, దేవుడికి మొదలులేదు, చివరలేదు. అచ్యుతా, అనంతా, గోవిందా ఇవి చాలు మనం పవిత్రులం అవ్వటానికి అని వ్యాసుడు చెపుతాడు. ఆయన నామాన్ని స్మరించటం వలననే మనం పవిత్రులం అయిపోతాము. అయితే మన దగ్గర దోషం ఏమిటి అంటే నామాన్ని ఇష్టంగా చేయము, అయిష్టంగా చేస్తాము, ఏదో ప్రయోజనం ఆశించి చేస్తాము. ఓ కృష్ణా! నిన్ను ప్రేమించటం కోసమే ప్రేమిస్తున్నాను అని హృదయ పూర్వకంగా నిండు మనస్సుతో అచ్యుతుడిని ఆరాధిస్తే ఇప్పుడే ఇక్కడే ఆయన దయను చూపించి మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, ఆయనే పరమాత్మ. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే సూర్యుడు

ఎంత పెద్ద వాడైనా మేఘాలు అడ్డువస్తూఉంటే ఆయన మనకు కనబడడు. అదేవిధంగా మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నప్పటికీ, మన బుద్ధిలో ఉన్న దోషాలు అనే మేఘాల వలన ఆయన మనకు గోచరించటం లేదు. కర్ణుడు భీష్ముడితో ఏమి చెపుతున్నాడు అంటే "పాండవులు మంచివారే కాని మంచి వారిని మంచి వారిగా గుర్తించనివ్వకుండా నా బుద్ధి మందగించింది, నేను చేసే స్నేహాల వలన నా బుద్ధి మొద్దుబారిపోయింది, చీకటి కింద అయిపోయింది, వెలుతురును చూడకుండా కళ్ళు మూసుకొని ఇంతకాలం జీవించాను. దేవాది దేవుడిని ఇంతకాలం గుర్తించలేకపోయాను, ఆ నల్లటివాడు లేనిచోటు అంటూ ఉండదు, ఆయన అంతర్యామే కాదు, సర్వజ్ఞుడు, మనలను నడిపే డ్రైవర్ ఆయనే. ఒకవేళ సుడిగుండాల కింద, మొసళ్ళ కింద పాండవులను పట్టుకొని పీడించి చంపేద్దాము అనుకొంటే ఆ నల్లటివాడు చంపనివ్వడు, నా ఆటలు ఆయన సాగనివ్వడు భీష్మా!" అంటాడు. "కర్ణా! ఇప్పుడు నీవు నా హృదయాన్ని జయించావు, నా హృదయంలో స్థానం సంపాదించావు" అంటాడు భీష్ముడు.

నన్ను నమ్మినవాడు, నాకోసం జీవించేవాడు, నా భక్తుడు ఎన్నటికీ చెడిపోడు అని పరమాత్మ చెపుతున్నాడు. నీ బుద్ధిని, మనస్సును, ఇంద్రియాలను నీకు ఉన్న తెలివిని భగవంతుడి పాదాల దగ్గర అర్పించి ఎప్పుడైతే జీవిస్తున్నావో అప్పుడు భగవంతుడే గురురూపంలో వచ్చి, నీకు సత్యాన్ని బోధించి, సత్యం దగ్గరకు వెళ్ళటానికి నీ మనస్సును అంతర్ముఖపరచి, దానికి లోచూపు నేర్పి ఆ వస్తువు నీచేతికి అందేటట్లు చేసేవరకు ఆయన నిన్ను వెంటాడుతాడు, వాడే గురువు, వాడే ఈశ్వరుడు. భగవదనుభవం పొందాలి లేకపోతే ఆప్రయత్నంలో మరణించాలి అనేటువంటి పట్టుదల, ఆ తపన లోపలనుండి రాకపోతే ఎవరు ఎన్ని చెప్పినా ఏమీ ప్రయోజనం లేదు, అది రావటానికి ఎంతోకొంత పుణ్యబలం ఉండాలి, పుణ్యబలం లేకపోతే లోపల నుండి ఆ తపన రాదు. మీరు శరీరం ద్వారా కాని, మనస్సు ద్వారా కాని, వాక్కు ద్వారా కాని, భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశముల ద్వారా ఏదో రకంగా పుణ్యబలం సంపాదించాలి. భగవాన్ ఏమి చెప్పారు అంటే పులి నోటిలో పడ్డ మాంసపు ముక్క ఏవిధంగా అయితే తిరిగి రాదో అలాగే గురువు అనుగ్రహంలో పడినవాడు వాడి శరీరాలు మారినా, పరిసరాలు మారినా, వాడు ఏ లోకంలో ఉన్నా గురువు వాడిని వెంటాడి వాడికి మోక్షానుభవం కలిగేవరకూ, నిర్వాణసుఖం వాడికి అందేవరకు వాడిని విడిచిపెట్టడు, వాడు గురువు. ఒక మహారాజ్యాన్ని త్యాగం చేసిన, మోక్షసుఖంలో ఊగిసలాడుతున్నా కూడా బుద్ధుడు ఎంత సింపుల్‌గా, ఎంత నిరాడంబరంగా చెపుతున్నాడో చూడండి "నేను స్వతంత్రమైన సుఖాన్ని ఏ రకంగా పొందానో, ఎలా సాధన చేసి భయంలో నుండి భయరహితస్థితిని పొందానో నాకు తెలుసున్నంత వరకు చెపుతున్నాను, నాకు అంతా తెలుసును అని చెప్పటం లేదు" అన్నాడు బుద్ధుడు.

జ్ఞానికి, అజ్ఞానికి తేడా ఏమిటి అంటే జ్ఞాని శరీరానికి మరణం వచ్చినప్పుడు నేను

మరణించటం లేదు, నేను ఉంటాను అని వాడికి అనుభవంలో తెలుస్తుంది కాని అజ్ఞాని శరీరానికి మరణం వచ్చినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. ఏ గురువు పట్ల మీ మనస్సు శృతికలుపుతోందో వారినే ఆరాధించండి, మీరు బాగుపడటం ముఖ్యం, అందరి ద్వారా పనిచేసేవాడు ఆ నల్లటివాడే. నువ్వు ఏ గురువును ఆశ్రయించినా, ఏ అవతార పురుషుడిని ఆశ్రయించినా నిన్ను అనుగ్రహించేవాడు వాడే. నీకు జ్ఞానం రావటంలేదని ఎంతమందిని తిట్టిపోస్తావు. నీకు జ్ఞానం రాకుండా ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు, కామక్రోధములు ఏ మనస్సులో అయితే ఉన్నాయో ఆ మనస్సే అడ్డువస్తోంది అన్న సంగతి నీకు తెలియటంలేదు. గురువువస్తాడు, నీకు సత్యాన్ని బోధిస్తాడు, నీ లోపల ఉన్న వాసనలను కెలికి నీ సహస్రారంలోనికి తీసుకొని వస్తాడు, నీలో కామక్రోధముల వేగం ఎంత ఉందో చూసుకొంటూ ఉంటాడు. ఆ వేగం ఎలా తగ్గించాలి అని చూస్తాడు. సడన్ బ్రేక్‌లు వేయడు, సడన్ బ్రేక్ వేస్తే ఏక్సిడెంట్ అయిపోతుంది. నెమ్మదిగా నీతో కలిసి ఉంటూ, నీతో మాట్లాడుతూ మీరు బాగున్నారా? అంటాడు, అన్నం తిన్నారా? అని అడుగుతాడు, ఆర్థికపరిస్థితుల గురించి అడుగుతూ అతి సన్నిహితంగా ఉంటూ మీకు తెలియకుండా సర్జరీ చేస్తాడు, వాడు గురువు. మనం గురువును ప్రేమించ గలమా? ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. గురువు ఎప్పుడైనా మనకు జ్ఞాపకం వస్తూ ఉంటే అది మన తెలివి తేటలవలన కాదు, అది కూడా గురువు యొక్క దయే. చలంగారు అంటారు "భగవాన్ ఎక్కడికి పోయావు, నీపేరే జ్ఞాపకం రావటం లేదు, ఒకోసారి అత్యంత సమీపంలోనికి వస్తావు, ఒకోసారి దూరంగా ఎక్కడికో పోతావు, ఎన్ని ఆటలు ఆడుకున్నా నా బలహీనతలలో నుండి నన్ను విడుదలచేయటానికే కదా అంటున్నారు. నీ చూపు వెలుగులలో ఏ మాటున ఉన్నదో ఈ మహత్తర ప్రేమ, ఏ చాటున ఉన్నదో ఇంత అనంతశక్తి. ఈ సారే తాగే చలంలో, మాంసం తినే చలంలో ఇంత మార్పు తీసుకొని వచ్చావు అంటున్నారు" చలంగారు.

తుకారామ్ చెపుతాడు 'సారా తాగితే మత్తు వస్తుంది, భగవంతుడి నామాన్ని స్మరించినా మత్తు వస్తుంది. కాని సారా తాగటం వలన వచ్చే మత్తు నిన్ను బంధిస్తుంది, హరినామస్మరణ వలన వచ్చే మత్తు నిన్ను బంధం నుండి విడుదల చేసి మోక్షాన్ని ఇస్తుంది' అని అన్నాడు. గీతలో భగవంతుడు పని చేయమని చెప్పాడు కదా అని అడిగితే భగవాన్ ఏమి చెప్పారు అంటే 'నటించేవాడు కనబడకూడదు, నటన జరిగిపోవాలి. అది భగవంతుడు చెప్పిన కర్మ. యాక్టర్‌లెస్ యాక్షన్. నువ్వు ఆ స్థాయికి వెళితే వాసుదేవుడి యొక్క వైభవం నీకు తెలుస్తుంది. మోక్షం కోసం కంగారుపడవద్దు, ఎంజాయ్ కృష్ణా, మీకు ఇష్టమైన వస్తువు తింటున్నారు అనుకోండి మీరు ఎంత బాగా ఎంజాయ్ చేస్తారో అలాగ కృష్ణుడిని ఎంజాయ్ చెయ్యండి, మోక్షం తరువాత చూద్దాము. "హరేకృష్ణ, హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ, హరే రామ, రామ రామ హరే హరే" అంటూ ఆ నామం మన చెవిలో పడాలని వీధులలో భజన చేసుకొంటూ శ్రీకృష్ణ

చైతన్య వెళుతూ ఉంటే కొంతమంది దేవుడి మీద నమ్మకం లేనివారు ఏమిటి ఈ పబ్లిక్ న్యూసెన్స్ అనుకొనేవారు. వారి మాటలను ఆయన పట్టించుకోలేదు, ఆ మాటలకు కోపం తెచ్చుకోలేదు, వారు ఎక్కడో ఉన్నారు మన మాటలు, విమర్శలు అంత దూరం వెళ్లలేవు. శ్రీకృష్ణచైతన్య దగ్గర ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు, ఒకసారి చైతన్యుడు ఆనంద సముద్రంలో ఉన్నాడు 'నీకు ఏమి కావాలో కోరుకో?' అని ఆ ముస్లిం భక్తుడిని అడిగాడు. వారి భక్తి చూస్తే మనకు వళ్ళు పులకరిస్తుంది. ఆ ముస్లిం భక్తుడు ఏమన్నాడు అంటే 'నాకు ఏమీ అక్కరలేదు. నువ్వు లేని ఈ ప్రపంచాన్ని నేను చూడలేను అందుచేత నీ ముక్కులో గాలి పోకముందే నా ముక్కులో గాలి పోవాలి, అదే నేను కోరుకునేది' అన్నాడు. చివరకు శ్రీకృష్ణ చైతన్య ఆ భక్తుడి శవాన్ని తన చేతులతో సమాధి చేసాడు. ఇప్పటికీ పూరిజగన్నాథంలో సముద్రం ఒడ్డున ఆ సమాధి ఉంది. కర్తృత్వంతో ఏ పనిచేసినా మంచికి మంచి, చెడ్డకు చెడ్డ నీకు అనుభవంలోనికి వస్తుంది. కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా నీవు మూడు లోకాలను దహనం చేసినా నీకు పాపం అంటదు, కర్తృత్వంతో చేసేవా నీ శరీరం కూడా నీడ వచ్చినట్లు నీవు చేసిన కర్మ నీకూడా వచ్చేస్తుంది, అది అనుభవించేవరకు నిన్ను వదిలిపెట్టదు. ఇప్పుడు నీవు ఎలా చేస్తున్నావో అలా కర్మ చేయమని భగవంతుడు చెప్పలేదు, లోపల నేను చేస్తున్నాను అనే భావన లేకుండా పని చేయమని భగవంతుడి భోద.

మనం అధ్యయనం చేసినా, పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా, విచారణ చేసినా గమ్యం ఆత్మజ్ఞానం మీద ఉంటే నీకు పునర్జన్మతో సంబంధం లేకుండా ఈ శరీరంలో ఉండగానే, ఇప్పడే, ఇక్కడే నీకు మోక్షస్థితిని ప్రసాదిస్తాడు, వాడే గురువు, వాడే ఈశ్వరుడు. ఎవడైతే రాగద్వేషములనుండి విడుదలపొందాడో వాడు ఎటుచూసినా, ఏమి చేసినా వాడికి ఆత్మానందమే. మోక్షం మాట తరువాత చూద్దాము, ముందు భగవంతుడిని ఎంజాయ్ చేయండి. తుకారామ్ ఏమంటున్నాడు అంటే "ఓ కృష్ణా! ఓ పాండురంగా! నీ నామం చేసుకొంటూ ఉంటే తియ్యటి మిఠాయిలలో కూడా నాకు రుచి కనిపించటం లేదు. మనం రామరామ అన్నా పలావు దగ్గరకు వచ్చే వరకే. కాని తుకారామ్ ఏమంటున్నాడు అంటే "నీ నామం చేసుకొంటూ ఉంటే పలావు ఎదురుగా పెట్టినా దాని మీద ఆకర్షణ కలగటం లేదు" అంటున్నాడు. "ఈ సృష్టిలో అనేక ఆకర్షణలు, అనేక అద్భుతాలు, అనేక ప్రలోభాలు ఉన్నాయి. నీ నామం చేస్తూ ఉంటే ఓ కృష్ణా అవి ఏమీ నన్ను ఆకర్షించటం లేదు" అన్నాడు తుకారామ్. భగవంతుని నామమే మనలను ప్రకృతి గుణాలనుండి విడుదల చేస్తుంది, మనం కర్మ చేస్తున్నా దాని ఫలితం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దాని మీద ఆసక్తి పోతుంది. "ఎవరికైనా సహాయ సహకారములు చేసినా, సమాజానికి ఎంతో కొంతమంచి అందించాలి అనుకొన్నా వీరు నా పనే చేస్తున్నారు, నా గురించే జపిస్తున్నారు" అని భగవంతుడు అనుకొంటాడు. "మంచితనం,

భగవంతుడు వేరుకాదు" అంటాడు సోక్రటీసు. భగవంతుడి నామాన్ని ఎంజాయ్ చెయ్యండి, భగవంతుడి వైభవాన్ని ఎంజాయ్ చెయ్యండి. మోక్షం, నిర్వాణస్థితి వీటి గొడవ తరువాత చూద్దాము. ఈశ్వరుడి యొక్క ఔన్నత్యాన్ని జుర్రుకోండి. ఏది, ఎప్పుడు, ఎక్కడ ఇవ్వాలో ఆ ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు. తిలక్‌గారు కొన్ని సంవత్సరాలు జైలులో ఉన్నారు అప్పుడు టైము పాడుచేసుకోకుండా గీతకు వ్యాఖ్యానం వ్రాసారు. మనకు ఏదైనా కష్టం వస్తే టైము పాడుచేసుకొంటాము. తిలక్‌గారు ఆ కష్టాన్ని దేవుడే పంపాడనుకొంటూ, ఆ కష్టాన్ని తపస్సుగా భావించి గీతకు వ్యాఖ్యానం వ్రాసారు. కర్త ఈశ్వరుడు, ఫలితం ఆయన చేతిలో ఉంది. భగవంతుడు నీ శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో అది హృదయ పూర్వకంగా, నిండు మనస్సుతో, భక్తితో ఆచరించండి. పనిచెయ్యి ఆసక్తి లేకుండా చెయ్యి, నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, కాలప్రవాహంలో నీకు మోక్షం వస్తుంది. కర్మను సన్యసించటం కాదు, కర్మను ఆచరిస్తూ దాని ఫలాన్ని త్యాగం చేసేవారు, అంటే కర్మఫలత్యాగులు గొప్పవారు, వారే నిజమైన సన్యాసులు. కోరిక, కోపం, ద్వేషం లేకుండా పని చేయండి. "నేను అది సాధించాను, నేను ఇది సాధించాను, నేను గొప్ప గొప్ప లోకాలకు వెళ్లిపోతాను అని నువ్వు అనుకొంటున్నావు కదా, ఈ అనుకొనేవాడు ఎవడు? వాడే సైతాను, వాడిలోనుండి బయటకు రా!..." అంటున్నారు భగవాన్. "వాడు ఎక్కడ నుండి వస్తున్నాడో పరిశీలించు, దేహము నేను అనే తలంపు నీకు లోపల నుండే వస్తోంది. ఆ తలంపును పట్టుకొని వెంటాడి ఆ తలంపు ఉదయించిన చోటును చూడగలిగితే ఈ సైతాన్ అదృశ్యమయిపోతుంది, ఆ మూలతలంపు మూలంలో ఉన్నది పరమసత్యం, దానికి తలంపులు లేవు, అది నీకు వ్యక్తమవుతుంది, అదే నీ గమ్యం" అంటున్నారు భగవాన్.

శరీరం వచ్చింది అంటే ఏదో రోజు మరణిస్తుంది, అది ప్రకృతి సహజం, దాని గురించి బాధపడవద్దు. 'భగవంతుడు జన్మరహితుడు, కర్మరహితుడు. ఈ చిన్న విషయం మీకు అర్థం అయినా మోక్షం వస్తుంది' అంటున్నాడు పరమాత్మ. గురువును ఆశ్రయించు, గురువు చెయ్యి పట్టుకో, గురువును సేవిస్తూ ఉంటే, ఆయనను ప్రేమిస్తూ ఉంటే నీకు ఏ కారణం వలన దుఃఖం వస్తుందో ఆ కారణాన్ని ఎలా తొలగించాలో గురువు చూసుకొంటాడు. గురువు యొక్క ప్రేమ పుష్కలంగా ఉంటుంది, ఆయన ప్రేమ అపురూపంగా ఉంటుంది. మీరంటే మీ అమ్మగారికి బాగా ఇష్టం అనుకోండి, గురువు ప్రేమను తల్లి ప్రేమతో పోలిస్తే గురువును అవమానించినట్లే. గురువు ప్రేమతో పోల్చటానికి మేచింగ్ అంటూ ఏమీ లేదు. సముద్రం ఎంత నిండుగా ఉంటుందో, గురువు ప్రేమ కూడా అంత నిండుగా ఉంటుంది. కనీసం గురువు యొక్క ప్రేమ నీకు అర్థమయినా మోక్షం వస్తుంది. గురువు దయ చాలు, ఆయన చూపు చాలు మీకు శాంతి రావటానికి, కష్టపడి గుంజీలు తీయనక్కరలేదు. మీరు నామం చేసేటప్పుడు మీ మనస్సు, ఇంద్రియాలు అక్కడ ఉండాలి. నామం ప్రీతితో, భక్తితో, శ్రద్ధతో హృదయపూర్వకంగా చేస్తే

నామం వలననే మనం తరిస్తాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-09-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పుస్తకాలు చదవటం వలననే ఆత్మజ్ఞానం రాదు. చదవటం వలన నీవు సంపాదించిన నాలెడ్జి ఆత్మజ్ఞానం పొందటానికి కొంతవరకు సహాయం చేస్తుంది. శరీరం, మాట, మనస్సు ఇవి మూడూ పనిముట్లు, వీటిని మనం ప్రోపర్‌గా ఉపయోగించుకోవాలి. మనం కంగారు పడితే ఆత్మజ్ఞానం వచ్చేయదు, పిందిని మనం కోసి ముగ్గేస్తే అది ముగ్గదు, కుళ్ళిపోతుంది. శరీరం, మాట, మనస్సు వీటిని మనం ప్రోపర్‌గా ఉపయోగించుకొంటూఉంటే నెమ్మదిగా, సహజంగా ఆత్మజ్ఞానం వస్తుంది. "ప్రతీవాడి మనస్సులో మంచి, చెడ్డ రెండూ ఉంటాయి. ఇందులో మనం దేనికి అన్నం పెడుతున్నాము అనేది మనం చూసుకోవాలి" అని బుద్ధుడు చెప్పాడు. మంచికి అన్నం పెడుతూ ఉంటే చెడ్డ తగ్గుతూ ఉంటుంది, చెడ్డకు అన్నం పెడుతూ ఉంటే మంచి తగ్గుతుంది. దేనికి అన్నం పెడుతున్నామో చూసుకోకుండా ఏవో పుస్తకాలు చదవటం వలన వచ్చేది సున్నా. చెడ్డకు అన్నం పెడుతూ రామా, రామా అంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుందా? మనం దేనికి అన్నం పెడుతున్నాము అనేది జాగ్రత్తగా చూసుకోవాలి, అదే నిజమైన సాధన. కొంతమందికి బాహ్యంగా కారణాలు ఏమీ కనబడవు, భయం వస్తూ ఉంటుంది. లోపల ఉన్న భయం కూడా చెడ్డలో భాగమే. అందువలన భయానికి కూడా ఫీడ్ చేయవద్దు. భయం ఎక్కువ అవ్వటం వలన మెంటల్ హాస్పటల్‌కు వెళ్ళాలి. వారు ఇచ్చే మందుల వలన భయం తగ్గదు, భయం అణుగుతుంది. రోగాన్ని అణచటం వేరు, రోగాన్ని తగ్గించుకోవటం వేరు. ఇతరులను చూసి అసూయపడటం ఎటువంటిదో భయం కూడా అటువంటిదే. హృదయంలో ఏమి జరుగుతుందో చూసుకోకుండా యాంత్రికంగా శివ, శివ అంటే సరిపోదు. శరీరం ద్వారా, మాటద్వారా, మనస్సు ద్వారా చెడుకు ఫుడ్ సప్లయి అవ్వకుండా చూసుకోవాలి, అదే సాధన.

మన దేహం చనిపోయే రోజుకు నూటికి నూరుపాళ్ళు ఆనందంలో ఉంటే ఇంక జన్మరాదు. మనం 99% ఆనందంలో ఉన్నా పునర్జన్మ వచ్చేస్తుంది. పుట్టుక వస్తే మరణం వచ్చేస్తుంది, అలా రిపీట్ అయిపోతూ ఉంటుంది. మనం రోజూ ఏడుస్తూ ఉంటాము, మనలో ఏడుపు ఇంకా ఉంటే ఏడవటానికి మరల పుడతాము. మనం ఏదైనా మంచి వాక్యం వింటే దానిని మనస్సులో తిప్పకోవాలి, అప్పడు అది మనస్సులో స్థిరపడుతుంది, అప్పడు మనలో ఉన్న మంచికి ఫుడ్ సప్లయి అవుతుంది. మనం కొంతమందిని ప్రేమించి, కొంతమందిని ప్రేమించలేకపోతే లోపల చెడు ఉందని అర్థం. దానిని మనం తొలగించుకోవాలి. పొయ్యిలో పుల్లలు మార్చి మార్చి పెడుతూ ఉంటాము, పుల్లలు మారుతూ ఉంటాయి, మంట కంటిన్యూ